# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 23, ఏప్రిల్ 2026






## నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి

**❊ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో వెంచర్ ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులకు సంబంధించి భూమిని పట్టణ ప్రణాళిక అధికారి సంపత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వెంచర్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరిచూసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన కార్యక్రమం జాగ్రత్తగా నిర్వహించాలి

**✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

జనగణన 2027 కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఇండ్ల గణనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం చేపట్టాలని, జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ వివరాలను అందించడం జరుగుతుందని తెలిపారు. మే 11వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. రోజురోజుకు ఉష్ణోగ్రత తీవ్రమవుతున్న దృష్ట్యా ఉదయం వేళలో ప్రక్రియ నిర్వహించేలా కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. తమ జాబితాలోని ఇండ్ల గణన కొరకు ముందుగా ఆయా ఇండ్ల యజమానులకు సమాచారం అందించినట్లయితే సమయానికి అందుబాటులో ఉంటారని, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమయపాలన పాటించాలని, ఇండ్ల గణన కొరకు నియమించబడిన అధికారులు ఎన్నికల విధులు నిర్వహించారని, అనుభవంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ మిగతా 2లో..





## జిల్లా విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలి

**❊ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత**



ఆసిఫాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :

జిల్లాలోని విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్ లో ఉన్నత స్థానాల్లో నిలవాలని జిల్లా కలెక్టర్ హరిత ఆకాంక్షించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా మాధ్యమిక విద్యా శాఖ అధికారి రాందాస్‌తో కలిసి ఇంటర్ ఫలితాలలో టాపర్లుగా నిలిచిన జిల్లా విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో జిల్లాను మంచి స్థానంలో నిలబెట్టి మంచి పేరును తీసుకొచ్చారని విద్యార్థులను కొనియాడారు. ఇంటర్ 2026 ఫలితాలలో మారుమూల మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించి జిల్లాకు గర్వ కారణంగా నిలచారన్నారు. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల సమిష్టి కృషితో రానించారన్నారు. జైనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపిసి విద్యార్థిని 967 మార్కులు సంపాదించిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపిసి విద్యార్థి అ చల్ సాయి వరప్రసాద్ 984, ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపిసి ఉర్దూ మీడియం విద్యార్థిని శాభిన 881, ప్రభుత్వ జూనియర్ కళాశాల దాహేగాం సిఇసి విద్యార్థి ఎల్కరి సంతోష్ 936 మార్కులు వచ్చాయాన్నారు. జిల్లా టాపర్‌లుగా నిలిచిన 15 మంది విద్యార్థులను శాలువలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమములో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ అధ్యాపకులు, విద్యార్థులు, తల్లి దండ్రులు, పాల్గొన్నారు.

## సింగరేణి యువ కార్మికుడు ఆత్మహత్య



ప్రణీత్ (ఫైల్)

- తాండూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : 2లో..

## జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి



✦ న్యాయం చేయాలని నాయకుల నిరసన

✦ తక్షణమే విద్యార్థి కుటుంబానికి ఉద్యోగం 20వేల నగదు అందజేత

జైనూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు ) మండలంలోని మహాగాం బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బాబ్జిపేట గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కోట్నాక్ గంగుబాయి (15) జ్వరంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలు బంధువులు నాయకులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు గంగుబాయి కి గత రెండు రోజులుగా జ్వరం వచ్చిందని ఆమెకు ఆసుపత్రికి తీసుక వెళ్లకుండా వసతి గృహంలోనే మాత్రలు ఇచ్చారని బుధవారం ఉదయం హాస్టల్లో టిఫిన్ చేసిన వెంటనే గంగుబాయి వాంతులు చేసుకొని కుప్పకూలిందని తెలిపారు.ఆ పాఠశాల ఉపాధ్యాయులు జైనూర్ ఆసుపత్రికి తీసుక రాగా వైద్యులు చికిత్స చేయకముందే ముందుగానే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పేర్కొన్నారు. 2లో..

# జనగణన కార్యక్రమం జాగ్రత్తగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు అందిస్తున్న శిక్షణలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రక్రియ నిర్వహించే సమయంలో తలెత్తే సందేహాల నివృత్తి కొరకు గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణకు హాజరు కాని వారు తరువాత ఏర్పాటు చేసే శిక్షణ కార్యక్రమానికి హాజరై ఇండ్ల గణన ప్రక్రియపై అవగాహన పొందాలని తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ఎన్నికల నిర్వహణ జనగణన పై ఆధారపడి ఉంటుందని, ఈ నేపథ్యంలో ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

అంతకుముందు మండలంలోని కిష్టంపేటలో గల డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెన్నూర్ పట్టణంలో చేపట్టిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణ పనులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులలో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, భోజనశాల, వంటశాల లను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎం పి ఎస్ ఓ ప్రవీణ్ కుమార్, ఫీల్డ్ ట్రైనర్లు సురేందర్, గోపికృష్ణ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఈ విషయం తెలియగానే ఆదివాసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కనక యాదవ రావు, ఆదివాసి నాయకులు సర్పంచులు ఆసుపత్రి చేరుకొని విద్యార్థిని మృతి పట్ల గంటల తరబడి ఆసుపత్రి మెట్ల వద్ద నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే ఆ విద్యార్థి మృతి చెందిదని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాత్ రావు, అసిఫాబాద్ గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారిణి రమాదేవి, ఉట్నూర్ పివిటిజి ఏపీఓ ఆత్రం భాస్కర్, ఏజెన్సీ విద్యాధికారి, జైనూర్ ఏటిడిఓ శ్రీనివాస్, సిర్పూర్ (యు ) మండల విద్యాశాఖ అధికారి కుడిమెత సుధాకర్, మహాగాం పాఠశాల హెచ్ఎం రాంబాయి, డిప్యూటీ వార్డెన్ శ్రీదేవి జైనూర్ ఆస్పత్రికి సందర్శించి విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించారు. అంతకుముందు నిరసన తెలుపుతున్న నాయకులతో అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా నిరసన తెలుపుతున్న జేఏసీ కన్వీనర్ నాయకులు అధికారులతో మాట్లాడుతూ మృతురాలు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఆసిఫాబాద్ డిడి రమాదేవికి, అధికారులకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థిని కుటుంబానికి తక్షణమే రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు వారి డిమాండ్ల హామీ ఇస్తూ తక్షణ సహాయం క్రింద రూ.20వేలు ఇస్తూ ఆ కుటుంబంలో ఒకరికి ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఉదయం నుండి ఆదివాసి నాయకులు ధర్నా చేసి నిరసన తెలుపడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జైనూర్ సీఐ రమేష్, ఎస్సైలు ఆసుపత్రిలో భద్రత పర్యవేక్షణ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మహగాం సర్పంచ్ సెడమకి జానే రావు, ధనోరా బాబ్జిపేట్ సర్పంచ్‌లు మెస్రం స్పందన భూపతి మాధవరావు, డిసిసి కార్యవర్గ సభ్యులు ప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఇంతియాజ్ లాల, నాయకులు మృతురాలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి

తాండూర్, ప్రభాతవార్త :



గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని బెల్లంపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ స్వరూప అన్నారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా తాండూర్ మండలంలోని కిష్టంపేట, రేచిని గ్రామ పంచాయతీలలో బుధవారం అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ స్వరూప మాట్లాడుతూ పాలు, గుడ్లు, ఆకుకూరలు, విటమిన్, తదితర ప్రోటీన్లు ఉన్న ఆహార అర్థాలను తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్యం పట్ల ఎవరు నిరక్ష్యం చేయకూడదన్నారు. చిన్నపిల్లలకి మొబైల్ ఫోను ఇవ్వకూడదని, మొబైల్ ఫోను వల్ల పిల్లలకి కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమాలలో కిష్టంపేట, రేచిని సర్పంచులు సార్ల తిరుపతి, పోతురాజుల రాంబాయి, ఉప సర్పంచ్ అనుమండ్ల విక్రమ్, తాండూర్, మాదారం సెక్టార్ సూపర్ వైజర్లు స్వరూపరాణి, రమాదేవి, పంచాయతీ సెక్రటరీలు, వార్డు సభ్యులు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి యువ కార్మికుడు ఆత్మహత్య

తాండూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :

మండలంలోని రాజీవ్ నగర్ కు చెందిన ప్రణీత్ (25) అనే సింగరేణి యువ కార్మికుడు మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ రాజ మొగిలి తెలిపారు. ఏఎస్ఐ కథనం ప్రకారం.... ప్రణీత్ కాసిపేట 2 గనిలో ట్రామర్‌గా పనిచేస్తున్నాడు. రెండో షిఫ్ట్ కు వెళ్లి విధులు ముగించుకొని అర్ధరాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చాడు. కాలు, చేతులు కడుక్కొని తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. తండ్రి లేచి చూసేసరికి కొడుకు తన గదిలో ఫ్యాన్ కు ఉరేసుకొని కనిపించాడు. దీంతో ఇరుగుపొరుగు వారి సహాయంతో కిందికి దించి చికిత్స నిమిత్తం బెల్లంపల్లి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తన కుమారుడికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు, ఇతరత్రా కారణాలు కూడా ఏమీ లేవని, ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో అంతుచిక్కడం లేదని తండ్రి కన్నీళ్ల పర్యంతం చెందారు. మృతుడి తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు తాండూర్ ఏఎస్ఐ రాజ మొగిలి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భూమి దినోత్సవం సందర్భంగా అవగాహన క్విజ్ పోటీలు

- విజేతలకు బహుమతులు
- పర్యావరణ సంరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం
- ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, ప్రశంస పత్రాలు

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

భూమి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీయం స్పర్శ్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేంపల్లి జెడ్పీ ఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థుల కోసం పర్యావరణ అవగాహనపై క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. భూమి పరిరక్షణ, పర్యావరణ సంరక్షణపై చిన్నారుల్లో చైతన్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. చెట్లు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి మంచి అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పర్శ్ సభ్యులు చిలుకూరి సుశీల, ఉపాధ్యాయులు ప్రకాష్, లక్ష్మీనారాయణ, ఓం ప్రకాష్, శాంతి కుమారి, మాధవి, శ్రీనివాసు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.



# ప్రైవేట్ టీచర్లకు పూర్తి నెల జీతం చెల్లించాలి

* జనసేన నాయకుడు సుంకేట మహేష్ బాబు

భైంసా, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:



భైంసా లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన పార్టీ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు

భైంసా డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఏప్రిల్ నెల పూర్తి వేతనం ఇప్పించాలని కోరుతూ జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు బుధవారం కార్మిక సహాయక అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెల 24 నుండి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో, ప్రైవేట్ యాజమాన్యాలు టీచర్లకు కేవలం పని దినాల వరకే జీతం ఇచ్చి, మిగిలిన వారం రోజుల వేతనాన్ని మినహాయించుకోవాలని చూడటం అన్యాయమని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఏడాది మొత్తానికి సంబంధించిన ఫీజులు వసూలు చేస్తూ, సిబ్బందికి మాత్రం పూర్తి నెల జీతం ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులను రోజువారీ కూలీలుగా చూడటం వారి జ్ఞానాన్ని, అనుభవాన్ని అవమానించడమేనని విమర్శించారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి, ప్రైవేట్ పాఠశాల సిబ్బంది అందరికీ ఈ నెల పూర్తి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని సుంకేట మహేష్ బాబు డిమాండ్ చేశారు.

## ప్రకృతి మిత్ర ఆధ్వర్యంలో
# ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

**- మానవ తప్పిదాలతోనే భూగోళానికి విఘాతం - పర్యావరణ మిత్ర అలవాట్లు ప్రకృతి రక్షణకు మెట్లు**

**- నేల తల్లిని పచ్చదనంతో నింపాలి**

**మంచిర్యాల, ఏప్రిల్ 22, ప్రభాతవార్త**

ప్రపంచ భూగోళ సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకృతి మిత్ర పర్యావరణ, సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాలలో భూగోళ సంరక్షణ, పర్యావరణం పై అవగాహన వేడుకలు నిర్వహించారు. మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని వేంపల్లిలో ఉన్న ఎస్.ఆర్.కె.ఎం నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు భూగోళ సంరక్షణ మానవ బాధ్యత అంశంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు పాడిన ప్రకృతికి సంబంధించిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అతిథులకు మట్టి పాత్రలను సమర్పించారు. అదే విధంగా పలువురు తయారు చేసిన ప్రకృతి సిద్ధ మైనటువంటి వివిధ వస్తువులను ప్రదర్శించారు. ధరిత్రి దినోత్సవానికి సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన సందేశత్మక ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో వన మహోత్సవం నిర్వహించి ప్రకృతి మిత్ర వ్యవస్థాపకులు గుండేటి యోగేశ్వర్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా భూగర్భ జల శాఖ అధికారి వేముల సురేష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భూగర్భ జలాలను, వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇంకుడు గుంతల నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వ వాల్టాచట్టం నిబంధన మేరకు బోర్వెల్స్ ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలను రక్షించుకో వాలన్నారు. నీటి కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటిని పొదుపు చేసి భావి తరాలకు అందించే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ప్రకృతిమిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ వాల్టా చట్టం పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లనే భూగోళ సంరక్షణకు విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు నేలకు, నీటికి, మట్టికి, చెట్టుకు, గాలికి హాని కలిగించని ప్రకృతి మిత్ర అలవాట్లను పెంపొందించు కోవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్ నివారణకు, క్లోరో ఫ్లోరో వాయువుల నియంత్రించాలని, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ సిస్టం వాడుకోవాలని, బజార్కు బట్ట సంచులు తీసుకెళ్లి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ మానివేయాలని సూచించారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ మాట్లాడుతూ పుట్టినరోజుతోపాటు వివిధ సందర్భాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ పోటు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ భారతదేశ సంస్కృుతి, పండుగల ఆచారాల వల్లనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని. మన దేశం ప్రపంచానికి ఆదర్శం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ హెచ్ఈఓ జి.నాందేవ్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్ కుమార్ పర్యావరణ ప్రేమికులు మోతే శరత్ చంద్ర, రాజశేఖర్, కుమ్మరి కళాకారులు రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది యుగంధర్, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి మిత్ర సభ్యులు


ఎంఈఓ మహేందర్‌ను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

## నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో ఫేర్‌వెల్ వేడుకలు

**- విద్యార్థుల ప్రతిభ అమోఘం**

**సారంగాపూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో ఉన్న నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాలలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న గురుకుల కోచింగ్ ఉత్తమ ఫలితాలను ఇస్తోందని, ఈ ఏడాది కూడా 30 గురుకుల సీట్లు సాధించి మండలంలోనే మొదటి స్థానంలో నిలిచామని యాజమాన్యం సగర్వంగా ప్రకటించింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ మహేందర్‌ను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట గంగాధర్, కరస్పాండెంట్ కిష్టయ్య, ఉపసర్పంచ్ ఇప్ప శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రామ కార్యదర్శి సుధాకర్, మ్యాక్స్ ప్రెసిడెంట్ భూమారెడ్డి, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమేష్, నవీన్, నారాయణ, పోశెట్టి, రాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరయ్యారు.



మొక్కలను పరిశీలిస్తూ, సిబ్బందికి సూచనలు చేస్తున్న నిర్మల్ డిఎఫ్ఓ

## అడెల్లి నందనవనాన్ని సందర్శించిన నిర్మల్ డిఎఫ్ఓ

**సారంగాపూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ సమీపంలో ఉన్న నందనవనాన్ని నిర్మల్ జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ బోబడే బుధవారం సందర్శించారు. నందనవనంలోని వసతులు, పచ్చదనం నిర్వహణ తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ మాట్లాడుతూ.. నందనవనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మరికొన్ని విశ్రాంతి షెడ్ల నిర్మాణం అవసరమని గుర్తించారు. కొత్త షెడ్ల నిర్మాణానికి సంబంధించి తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వనాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో అటవీ మండలాధికారి నాగిని భాను, నిర్మల్ అటవీ క్షేత్రాధికారి రామకృష్ణారావు, సారంగాపూర్ ఉప అటవీ క్షేత్రాధికారి మొహమ్మద్ నజీర్ ఖాన్, ఎఫ్బిఓలు వెన్నెల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

**- తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న**

**తాండూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :**



మండలంలో ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న పేర్కొన్నారు. మండల పరిధిలోని కిష్టంపేట గ్రామ సర్వే నంబరు 8, తాండూర్ గ్రామ సర్వే నంబరు 699లోని ప్రభుత్వ భూములను కొందరు వ్యక్తులు చదును చేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ తమ దృష్టికి రావడంతో బుధవారం ఆ భూములలో ఖఇది ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడునుĠ అనే బోర్డులను గిర్దావర్ పద్మజ, సర్వేయర్ రామకృష్ణ రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వ భూములు, ఆస్తుల పరిరక్షణకు, భవిష్యత్తులో ఎటువంటి ఆక్రమణలు జరగకుండా తగిన చర్యలు చూసుకుంటామన్నారు.

## ఎల్కపల్లిలో రహదారి అడ్డంకుల తొలగింపు

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :**

మండలంలోని ఎల్కపల్లి గ్రామం 6వ వార్డులో రహదారికి ఇరువైపులా అనవసరంగా పెరిగి రాకపోకలకు అడ్డంకిగా మారిన చెట్లను సర్పంచ్ భక్తు రాంచందర్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కల్గిస్తున్న చెట్లను గ్రామ ప్రజల సౌకర్యం దృష్ట్యా తొలగించినట్లు ఆయన తెలిపారు.



## డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ

**తాండూర్, ఏప్రిల్ 22:**

**ప్రభాతవార్త :**



మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని కురుమ వాడలో బుధవారం డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ ఆకుల వెంకటేష్, డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ రూ.5 లక్షల నిధులతో డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నీలాయపల్లి సర్పంచ్ పోలవేణి తిరుపతి, కొత్తపల్లి గ్రామ సెక్రటరీ లక్ష్మణ్, వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- సర్పంచ్ సిరం సుష్మారెడ్డి**

**భైంసా, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**



రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి సూచించారు. బుధవారం దేగాం గ్రామంలో మొక్కజొన్న సబ్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దేగాంతో పాటు పరిసర గ్రామాల రైతులు తమ పంటకు సరైన మద్దతు ధర పొందాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధర లభిస్తోందని, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినందుకు ఆమె ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సొసైటీ సీఈఓ రాజు, ఉపసర్పంచ్ శివాజీ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో మదర్ ఎర్త్ డే పక్షం.. విద్యార్థుల ర్యాలీ

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన - ప్లాస్టిక్ తగ్గింపు, పచ్చదనం పెంపు పై సందేశం



ర్యాలీని ప్రారంభిస్తున్న కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా



ర్యాలీలో పాల్గొన్న సబ్‌కలెక్టర్, అధికారులు

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :**

అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని 99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్‌లో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని ముఖ్య వీధుల గుండా సాగి ప్రజల్లో పర్యావరణంపై చైతన్యం కల్పించింది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, సైక్లింగ్ వంటి పర్యావరణ హిత జీవన విధానాలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు చేతపట్టిన ప్లకార్డులు, నినాదాలతో ఆకట్టుకున్నారు. భూమిని కాపాడుదాం",ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం' పచ్చదనం పెంచుదాం" వంటి నినాదాలతో పట్టణంలో సందడి చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సబ్ కలెక్టర్ శ్రీమతి శ్రద్ధ శుక్లా మాట్లాడుతూ, భూమి పరిరక్షణ ప్రతి మనిషి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు చెట్ల నాటకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, నీటి సంరక్షణ వంటి చర్యలు ప్రతి ఒక్కరూ చేపట్టాలని సూచించారు. చిన్నచిన్న మార్పులు పెద్ద ఫలితాలకు దారి తీస్తాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మరియు పర్యావరణ అంబాసిడర్ కటకం మధూకర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జాడి దేవాజీ, మండల తహసీల్దార్ మధుకర్, మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహ, అసిస్టెంట్ ప్రొఫెసర్ జనార్ధన్, ఉపాధ్యాయులు మమ్మద్ షాబీర్, సూత్రాల వేణు, శ్యామ్ రావు, త్రివేణి, వైర శ్రీనివాస్ పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ ర్యాలీ ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ఎన్ కృష్ణ.

### ఘనంగా గ్రాడ్యుయేషన్ డే..

## ప్రైవేటుకు ధీటుగా సర్కారు బడి

**భైంసా, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

మండలంలోని మహాగాం గ్రామ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు ఎన్ కృష్ణ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి రాకేష్ మాట్లాడుతూ.. మహాగాం పాఠశాల విద్యార్థులు బాసర ఐఐటీ ద్వారా ప్రశంసలు పొందడం, గురుకులాల్లో సీట్లు సాధించడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉపసర్పంచ్ వరపు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన సాగుతోందని, ఇందుకు ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ కృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రేవతి, ఉపాధ్యాయులు హరీష్, రాగిణి, అభిషేక్, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి మొక్కను అందజేస్తున్న నూతన డిసిఓ శ్రీనివాసరావు

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిసిఓ

**నిర్మల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను నూతన జిల్లా సహకార అధికారి ఎన్. శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఆయన, కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టరుకు పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన డిసిఓకు శుభాకాంక్షలు తెలిపారు. విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ, శాఖాపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయనకు సూచించారు.

## బావిలో దూకి మహిళ ఆత్మహత్య

**నార్నూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**



అప్పుల బాధ తాళలేక ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం నార్నూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కొలం గూడకు చెందిన అలువోజు వనజ (48) నివసించేందుకు అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్నారు. అయితే చేసిన అప్పులు పెరిగిపోవడంతో, అవి తీర్చే మార్గం కనిపించక గత కొంతకాలంగా ఆమె మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులందరూ నిద్రపోతున్న సమయంలో ఇంటి సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం బావిలో మృతదేహం తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఐకెపి సెంటర్ ప్రారంభించిన డిసిసి ఉపాధ్యక్షుడు ముద్దసాని వేణు

**దండేపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామంలోని కుమ్మగూడెం వాడలోని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు డిసిసి ఉపాధ్యక్షుడు ముద్దసాని వేణు,స్థానిక నాయకులతో కలిసి ఐకేపీ సెంటర్‌ను ప్రారంభించారు. బుధవారం ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కారుకురి తిరుపతి,ఐకెపి సిబ్బంది,స్థానిక నాయకులు ముత్తే వెంకటేష్, మోటపకుల కమలాకర్,సీనియర్ నాయకులు సందెల సురేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రంలో 8 వ పోషణ పక్వాడ కార్యక్రమం

**దండేపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త**



దండేపల్లి మండలంలోని గుడిరేవు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో 8 వ పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమం భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ జె వెంకట లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే ను ఉత్సాహంగా నిర్వహించడం జరిగిందని, చిన్నారులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి కార్యక్రమం చేయడం జరుగుతుందని, అంగన్వాడి కేంద్రాల్లో నేర్చుకున్న అంశాలను ఆటలను పాటలను కథలను తల్లిదండ్రుల ముందు పిల్లల చేత చెప్పించడం జరిగిందని. పిల్లలకు చదువు చెప్పడంలో తల్లిదండ్రుల పాత్ర గురించి ఇంట్లో పిల్లలకి విద్య ఎలా నేర్పించాలి అని సూచనలు ఇవ్వడం జరిగింది తల్లిదండ్రులు పిల్లలతో కలిసి సమయం గడపాలని చెప్పరు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలుకి అన్నప్రాసన చేయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిరేవు గ్రామ సర్పంచ్ సంతపురి కళావతి, ఆరోగ్య కార్యకర్త, గ్రామంలోని గర్భిణీలు బాలింతలు పిల్లలు పెద్దలు అంగన్వాడి టీచర్స్ లక్ష్మి, రాజేశ్వరి, అంగన్వాడి ఆయా సుజాత పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :**

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ లు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద చేపడుతున్న ఆర్టీసీ కార్మికుల నిరవధిక నిరాహార దీక్ష శిబిరానికి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర ప్రజలకు నిరంతర సేవలు అందిస్తూన్న ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కార్మికులు చేపడుతున్న సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, సాలం బీన్ అహ్మద్, మాజీ ఎఎంసి, సింగల్ విండో చైర్మన్ గంధం శ్రీనివాస్, అలీ బీన్ అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నీసార్, దూడల అశోక్ పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు పంపిణీ

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :**

మండలంలోని ఎల్లూర్, కొత్తగూడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు బుధవారం సర్పంచ్ చప్పిడి రవీందర్ మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండ తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నీరు ఎక్కువగా తాగుతూ శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలన్నారు. ఉదయం మరియు సాయంత్రం వేళల్లోనే పనులు నిర్వహించడం మంచిదని తెలిపారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే అధికారులకు లేదా వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు కూలీల ఆరోగ్యం గ్రామ అభివృద్ధికి ముఖ్యమని అందరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులకు షీ టీమ్స్‌పై అవగాహన సదస్సు

**- విద్యార్థుల భద్రతలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం: ఎస్ఐ.హైమ**

మంచిర్యాల, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

పాఠశాల విద్యార్థుల భద్రత,మహిళల రక్షణలో షీ టీమ్స్ పాత్రతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్‌లో జనగణన శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు మంచిర్యాల జిల్లా షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ. హైమ మాట్లాడుతూ, విద్యార్థులు తమ సమస్యలను తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ఉపాధ్యాయులతో పంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గమనించి,వారికి ఏమైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని సూచించారు.వేధింపులకు గురయ్యే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. వేధింపులకు గురయ్యే మహిళలకు, బాలికలకు షీ టీమ్స్ అందించే సహాయం గురించి వివరించారు. చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సోషల్ మీడియా వినియోగం,ఆన్‌లైన్ వేధింపులు మరియు సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులను ఎలా రక్షించాలో వివరించారు.ఆన్‌లైన్ మోసాలకు గురైనపుడు బాధితులు గోల్డెన్ అవర్‌లోపు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలల హక్కులు మరియు పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు కనీస అవగాహన ఉండాలని తెలిపారు. విద్యార్థినులు, మహిళల భద్రత కోసం టి సేఫ్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే విధానం గురించి వివరించారు. పని ప్రదేశాల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 100 లేదా 112కు, అలాగే రామగుండం షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆఫీసర్ సంపత్ కుమార్, జనగణన శిక్షకులు హరిప్రసాద్, మధుబాబు, మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ. హైమ, కానిస్టేబుల్ సతీష్, మహిళా కానిస్టేబుల్ శ్రీలత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న పోలీసుల దృశ్యం

# బెల్లంపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కీలక అడుగు

**- సూపర్ ఫాస్ట్ రైళ్ల నిలుపుదలకు వినతి**

బెల్లంపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త



బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచాలని కోరుతూ బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ రమేష్ బాబు ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. బుధవారం బెల్లంపల్లికి విచ్చేసిన సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణన్ ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వేకు ప్రతి ఏడాది కోట్ల రూపాయల ఆదాయం అందిస్తున్న బెల్లంపల్లి స్టేషన్‌లో జీటీ, కేరళ, నవజీవన్, హజ్రత్ నిజాముద్దీన్, ఒకా పురి, వందే భారత్ వంటి ముఖ్య ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లను నిలిపివేయాలని కోరారు. రైళ్ల నిలుపుదలతో ప్రయాణికులకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. అదనంగా, స్టేషన్‌లో ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని పూర్తి స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, ఆర్పీఎఫ్ ఔట్‌పోస్టును సర్కిల్ కార్యాలయంగా అప్‌గ్రేడ్ చేసి తగిన సిబ్బందిని నియమించాలని సూచించారు. వృద్ధులు, వికలాంగుల కోసం ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేయడం, ప్రయాణికుల సౌకర్యార్థం ఏటీఎం ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఇక 10వ వార్డు రైల్వే కాలనీలో మురుగునీరు రోడ్డుపైకి రావడం సమస్యగా మారిందని, దీని పరిష్కారానికి శాశ్వతంగా మురుగు కాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమస్యలపై డీఆర్ఎం సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దీకొండ పద్మ, కాంపల్లి రాజం, టౌన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, నాయకులు దీకొండ రాజలింగు, దావ రమేష్ బాబు, నెల్లి రమేష్, పోచంపల్లి హరీష్, నీలి కృష్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

**- రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి శుభాకాంక్షలు**

బెల్లంపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త



దళిత అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడుతూ సమాజంలో చైతన్యం తీసుకువస్తున్న నాయకులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న దళిత రత్న అవార్డు గ్రహీతలను తెలంగాణ ప్రదేశ్ పార్టీ కమిటీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి సన్మానించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దళితులపై జరుగుతున్న అగ్రకుల దాడులు, పరువు హత్యలు, అత్యాచారాలు, మానభంగాలు, బహిష్కరణలను నిరంతరం ఖండిస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ వారి ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న నాయకుల సేవలు అమూల్యమని పేర్కొన్నారు. సామాజిక ఉద్యమాల ద్వారా జాతిని చైతన్యపరుస్తూ ఐక్యత కోసం కృషి చేస్తున్న వారిని ప్రభుత్వం గుర్తించడం అభినందనీయమన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ చేతుల మీదుగా ఈ అవార్డులు అందజేయడం జరిగింది. ఈ అవార్డులను అందుకున్న బెల్లంపల్లి పట్టణానికి చెందిన గంగారపు రమేష్ (రాష్ట్ర ఉపాధ్యక్షుడు), అకునూరి రాజ్‌కుమార్ (జిల్లా ప్రధాన కార్యదర్శి), ఎనగందుల శివాజీ (పట్టణ అధ్యక్షుడు)తో పాటు, బెల్లంపల్లి నియోజకవర్గం వాకేపల్లి గ్రామానికి చెందిన గోగ్గర్ల శేఖర్ (జిల్లా అధికార ప్రతినిధి)లను నాతరి స్వామి ప్రత్యేకంగా అభినందించారు.

# ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభం

**- ఉట్నూరులో మంత్రి జూపల్లి కృష్ణారావు**

ఉట్నూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండుగూడలో ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రాంను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లికి సాజిద్ ఖాన్ శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతలతో కలిసి కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాజిద్ ఖాన్ మాట్లాడుతూ, అడవుల్లో నివసిస్తున్న అనేక మంది ఆదివాసీలకు బయటి ప్రపంచంపై సరైన అవగాహన లేకపోవడంతో, కొంతమందికి జిల్లా కేంద్రం గురించి కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి ఆదివాసీలను హైదరాబాద్‌కు తీసుకువెళ్లి పర్యాటక, విద్యా ప్రదేశాలను చూపించడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచన మేరకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఆదివాసీలలో అవగాహనతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వెంకట్రావుపేటలో పోషణ పక్షం ప్రోగ్రాం

లక్సెట్టిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ పక్షం ప్రోగ్రాం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్సెట్టిపేట ప్రాజెక్టు సీడీపీవో రేష్మ, వెంకట్రావుపేట డాక్టర్ సతీష్, వెంకట్రావు పేట సర్పంచ్ నలిమెల రాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్ వాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సపోషిత జనని, స్వస్థ శిశు, వైవిధ్య మైన ఆహారం, గర్భ ధారణ నుండి 2 సంవత్సరాల వరకు పిల్లల సంరక్షణ, 0 నెలల - 3 సంవత్సరాలలో ప్రారంభ ప్రేరణ, మెదడు అభివృద్ధి, 3-6 సంవత్సరాలలో ఆట ఆధారిత విద్య గురించి చెప్పడం జరిగింది.గ్రాడ్యుయేషన్ డే చేసి పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. తర్వాత గర్భిణీ స్త్రీలకి, పిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, జాగ్రత్తలు, బిడ్డ పుట్టిన గంటలో తల్లి పాలు పట్టించడం, 2 సం., వరకు తల్లి పాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇవ్వాలని సూచించడం జరిగింది.అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణీ కి శ్రీమంతం చేశారు.అనంతరం పోషణ పక్షం ప్రతిజ్ఞ చెయ్యడం జరిగింది. అనంతరం పోషకాహార ప్రదర్శన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రేష్మ, డాక్టర్ సతీష్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానా, సూపర్ వైజర్ వాణి, సర్పంచ్ నలిమేల రాజు,ఉపసర్పంచ్ తిరుమల, డిస్ట్రిక్ట్ ఉమెన్ ఎమ్ పవర్ మెంట్ హబ్ కోఆర్డినేటర్ సౌజన్య, లిప్సిక, విజయ, పంచాయతీ సెక్రటరీ వంశీ, ఆశ, వెంకట్రావు పేట సెక్టార్ టీచర్లు, ఆయాలు, వార్డ్ మెంబెర్స్, గర్భిణీ, బాలింతలు, తల్లులు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.





సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

## బారెగూడ పాఠశాలలో

# ఘనంగా వార్షికోత్సవం

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బారెగూడ, రాస్పల్లి పాఠశాలలో వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు సృజన అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిలుకూరు సత్యనారాయణ, ఏటుకూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరుగుదలకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగ్, దుస్తులు, బూట్లు, టై, బెల్ట్ తదితర సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. గ్రామంలో 5 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క బాలబాలికను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆయా తరగతులను పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. తరగతుల వారీగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ్, మనషిని, ఉమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సావర్ కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయం

## - కలెక్టర్ హరిత

**కెరమెరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :**

జిల్లాలోని కెరమెరి మండలం సావర్ కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం కెరమెరి మండలం సావర్ కేడ గ్రామంలోని ప్రధానమంత్రి శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సావర్ కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయమని, ఇది ఐ ఎస్ ఓ సర్టిఫికెట్ పొందడానికి అర్హత ఉన్న గ్రామంగా అభివర్ణించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయడం ద్వారా విద్యార్థులను సామర్థ్యాలు పెంపొందించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు లక్ష్యాన్ని ఎంచుకొని ఏకాగ్రతతో పనిచేస్తే సావరఖేడ స్ఫూర్తితో మరిన్ని పాఠశాలలో తయారవుతాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత

# రైతుల ఆదాయ వృద్ధికి ఎఫ్‌పీఓలపై శిక్షణ

**దహెగాం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :**

జిల్లాలో ఆత్మ (ఏటిఎంఎ) ఆధ్వర్యంలో బుధవారం దహెగాం రైతు వేదికలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓ)పై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి/ప్రాజెక్టు డైరెక్టర్ ఆత్మ మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధరలు పొందడం, మార్కెట్‌కు నేరుగా అనుసంధానం కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఎఫ్‌పీఓఎస్‌ల ఏర్పాటును ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎఫ్‌పిఓ అనేది రైతులు సమూహంగా ఏర్పాటు చేసుకునే సంస్థగా, దీని ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటి ఇన్‌పుట్లను తక్కువ ధరలకు కొనుగోలు చేయగలరని, అలాగే పంటలను సమిష్టిగా విక్రయించడం ద్వారా మంచి ధరలు పొందే అవకాశముందని వివరించారు. అదేవిధంగా బ్యాంకు రుణాలు, సబ్సిడీలు సులభంగా పొందవచ్చని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీశివీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆదాయాన్ని పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, మండల వ్యవసాయాధికారి రామకృష్ణ , ఆత్మ సిబ్బంది శ్రీనివాస్, ఏఈఓఎస్‌లు రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్

# ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశానికి సిద్ధం కావాలి

● పిడి ప్రకాష్ రావు

**బెజ్జూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

బెజ్జూర్ గ్రామపంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను బుధవారం హౌసింగ్ పిడి ఎన్.టి ప్రకాష్ రావు, బిఎస్ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరిగతిన పూర్తి చేసుకొని గృహప్రవేశంకి సిద్ధం కావలసిందిగా సూచించారు. మండలంలో ఇంత వరకు వున్నా 63 ఇండ్ల సాంకేతిక సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. మండలం లోని వివిధ గ్రామ పంచాయతీలలో వున్న 25 ఇండ్ల సాంకేతికపారమైన సమస్యలను వెంటనే పరిష్కరించి వారం రోజుల్లోగా బిల్లులు విడుదల చేయనున్న మని అన్నారు. వివిధ దశలలో వున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తిచేసుకున్నట్లయితే వెంటనే బిల్లులు విడతల వారీగా మంజూరు చేస్తామని తెలియజేశారు. లబ్ధిధారులు ఎటువంటి అపోహలకు గురి కాకుండా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను వెంటనే నిర్మించుకొని సొంతిటి కలను సకారం చేసుకొనుటకు సదా అవకాశంగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హౌసింగ్ ఏఈ, ఏఈ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో మాట్లాడుతున్న పిడి

# జేఈఈ అడ్వాన్స్ అర్హతలో బెల్లంపల్లి సిఓఈ విద్యార్థుల ప్రతిభ

**బెల్లంపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఈ), బెల్లంపల్లి కళాశాల మరోసారి తన ప్రతిభను నిరూపించింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి, జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించడం విశేషంగా నిలిచింది. మొత్తం 33 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షలకు హాజరుకాగా, అందులో 15 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించడం విద్యాసంస్థకు గౌరవంగా మారింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, పట్టుదల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో మరింత మెరుగైన ఫలితాలు సాధించి, దేశంలోని అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీలు వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. జిల్లాలోని ఏకైక ప్రభుత్వ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాల నుంచి ఇంతమంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ అర్హత సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి, తమ కుటుంబాలకు మరియు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. డీసీఓ రమా కళ్యాణి కూడా విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకున్నారు. జెడ్ఓ గిరిజ చరవాణి ద్వారా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపి, రాబోయే ఫైనల్ పరీక్షలు మరియు జేఈఈ అడ్వాన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



**జేఈఈ అడ్వాన్స్ అర్హత సాధించిన విద్యార్థుల వివరాలు ఇవీ:**

మైలరపు విశ్వతేజ (84.58), డౌనే ఆదర్శ (83.92), గోదారి అంజన్న (82.41), రంటెంకి గిరిధర్ (82.00), దుర్గం అభిరామ్ (79.46), రాంటెకి హవీష్ (77.50), ఆవునూరి మనీష్ (72.11), దుర్గం యశో మార్ (70.70), జాడి జయవర్ధన్ (68.35), కామెరా బెన్ని (65.85), కలసి ధనుష్ (65.40), కొండగుర్ల రామ్ చరణ్ (65.15), ముడీమడుగుల రామ్ తేజ (64.88), బట్టి క్రాంతి రణ దేవ్ (53.96), మడికొండ అవినాష్ (32.95 - పిహెచ్సి). ఈ ఫలితాలతో బెల్లంపల్లి సిఓఈ కళాశాల రాష్ట్ర స్థాయిలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.